ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

రాష్ట్రవ్యాప్తంగా పల్స్‌పోలియో శిబిరాలు


సైదాపేట శిబిరంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం పల్స్‌పోలియో శిబిరాలు నిర్వహించారు. రాష్ట్రమంతటా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు, పౌష్టికాహార కేంద్రాలు, పాఠశాలలు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో ఈ శిబిరాలు జరిపారు. రాష్ట్రంలోని 43,051 శిబిరాల ద్వారా 57.84 లక్షలమంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరాలు కొనసాగాయి. నగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కార్పొరేషన్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

తిరువిక నగర్‌లో...

నగరంలోని తిరువికనగర్, సైదాపేట ప్రాంతాల్లో ఆదివారం ఉదయం పల్స్‌పోలియో శిబిరాలు నిర్వహించారు. తిరువికనగర్ శిబిరాన్ని దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రారంభించారు. మేయర్ ఆర్ ప్రియ, ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామి, శాసనసభ్యుడు తాయగం కవి, జోనల్‌కమిటీ సభ్యుడు సరితా మహేష్‌కుమార్, కౌన్సిలర్లు పునిదవది, తమిళ్‌సెల్వి తదితరులు పాల్గొన్నారు.

నేడు చెన్నైకి మోదీ రాక

● ఐదంచెల భద్రతా ఏర్పాట్లు



చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఒక రోజు పర్యటన నిమిత్తం సోమవారం మధ్యాహ్నం చెన్నైకి విచ్చేయనున్నారు. మోదీ రాక సందర్భంగా నగరంలోనూ, కల్పాక్కం అణు విద్యుత్ కేంద్రం పరిసరాలలోనూ పోలీసు ఉన్నతాధికారులు ఐదంచెల భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆయన నందనం వైఎంసీఏ మైదానంలో జరిగిప భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. అధికారుల సమాచారం మేరకు ప్రధాని నరేంద్రమోదీ సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు మహారాష్ట్ర నుంచి విమానంలో మధ్యాహ్నం 2.45 గంటలకు మీనంబాక్కం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో కల్పాక్కం చేరుకుని, కల్పాక్కంలో అణు విద్యుత్ కేంద్రంలో రూ.400 కోట్లతో స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఇంధన రీసైక్లింగ్ బ్లాస్టర్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.15 గంటల మధ్య వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం హెలికాప్టర్‌లో మీనాంబాక్కం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి కారులో నందనం వైఎంసీఏ మైదానం వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 6 గంటలకు జరిగే బీజేపీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సభ ముగిసిన వెంటనే మోదీ కారులో మీనాంబాక్కం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుండి విమానంలో తెలంగాణకు బయలుదేరుతారు.

భారీ భద్రతా ఏర్పాట్లు...

ప్రధాని మోదీ రాక సందర్భంగా నగరంలో పోలీసు అధికారులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇటీవల బెంగళూరులోని ఓ హోటల్‌లో బాంబు పేలిన ఘటన నేపథ్యంలో చెన్నైకి విచ్చేయనున్న ప్రధానికి పటిష్ఠ భద్రత కల్పిస్తున్నారు. కల్పాక్కం అణు విద్యుత్ కేంద్రం వద్ద, బీజేపీ బహిరంగ సభ జరగనున్న నందనం వైఎంసీఏ మైదానం వద్ద భారీ సంఖ్యలో పోలీసులు బందోబస్తు చేపడుతున్నారు. కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో, నివాస ప్రాంతాల్లోనూ సాయుధ పోలీసులు కాపలా కాస్తున్నారు. మీనంబాక్కం విమానాశ్ర యం నుంచి నందనం వైఎంసీఏ మైదానం వరకు రోడ్డు కిరువైపులా పోలీసులు బందోబస్తు చేయనున్నారు. అదే విధంగా నగరంలో సోమవారం ఉదయం నుం చి రాత్రి వరకూ డ్రోన్లు ఎగరవేయకూడదంటూ పోలీసులు ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రాఫిక్ మార్పులు...

ప్రధాని మోదీ రాకను పురస్కరించుకుని నందనం వైఎంసీ మైదానం పరిసర ప్రాంతాల్లో అన్నాసాలైలో ట్రాఫిక్ మార్పులు అమలు చేయనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు నందనం నుంచి అన్నాసాలై జెమినీ బ్రిడ్జి వరకూ వాహనాల రద్దీ అధికంగా ఉంటుందని, వాహన చోదకులు ఆ మార్గంలో కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలన్నారు. అన్నాసాలై, ఎస్వీ పటేల్ రోడ్డు, గాంధీ మండపం రోడ్డు, జీఎస్టీ రోడ్డు, మౌంట్, పూందమల్లి రోడ్డు, సీపెట్ జంక్షన్, వందడుగుల రహదారుల్లో వాహన చోదకులు ప్రయాణించకపోవడమే మంచిదని తెలిపారు. మధ్యకైలాష్ నుంచి హాల్డా జంక్షన్ వరకు, ఇందిరాగాంధీ రోడ్డు పల్లావరం నుండి కత్తిపారా జంక్షన్ వరకు, మౌంట్ పూందమల్లి నుంచి రామాపురం నుండి కత్తిపారా జంక్షన్ వర కు, అశోక్‌పిల్లర్ నుంచి కాంకార్డ్ జంక్షన్ వరకు, అన్నావిగ్రహం నుంచి మౌంట్ రోడ్డు వరకు, తేనాంపేట నందనం గాంధీ మండపం వరకు సోమవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు లారీ లు, వ్యాన్లు తదితర వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు నిషేధం విధించారు.

నేటినుంచి ప్లస్‌వన్ పబ్లిక్ పరీక్షలు



పెరంబూర్, మార్చి 3: రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 7,534 పాఠశాలల నుంచి 3,89,736 మంది విద్యార్థులు, 4,30,471 మంది విద్యార్థినులు సహా 8,20,207 మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. అలాగే 5,000 మంది ప్రైవేటు అభ్యర్థులు, 187 ఖైదీలు కూడా పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షల కోసం 3,302 పరీక్షా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పరీక్షల్లో అవకతవకలను అడ్డుకొనేలా 3,200 ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు, 46,700 మంది పరీక్షల పర్యవేక్షణాధికారులు విధులు చేపట్టనున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్ సౌకర్యం కల్పించారు. తొలిరోజు తమిళం పరీక్ష జరగనుంది. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు జరుగనుంది. సోమవారం ప్రారంభం కానున్న పరీక్షలు ఈ నెల 25వ తేది వరకు జరుగుతాయి.

ఆ ఒక్కసీటు ఎవరిస్తారో?


● అయోమయంలో కమల్



చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో తమ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో తెలియక మక్కల్ నీదిమయ్యం నేత కమలహాసన్ అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల డీఎంకే సీనియర్ నేతలు చేసిన ప్రకటనలు కూడా డీఎంకే కూటమిలో ఎంఎన్‌ఎం ఉందో లేదో తెలియని అనిశ్చిత పరిస్థితి కొనసాగుతున్నట్లుగా స్పష్టం చేస్తున్నాయి. తొలి నుంచి డీఎంకే కూటమిలో చేరితే కనీసం రెండు లోక్‌సభ నియోజకవర్గాలు కేటాయిస్తారని కమల్ ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం డీఎంకే కూటమిలోని మిత్రపక్షాలకు మునుపటి లోక్‌సభ ఎన్నికల సమయంలో కేటాయించినట్లుగానే సీట్లు కేటాయిస్తున్నారు. వామపక్షాలకు ఇప్పటికే తలా రెండు సీట్లు కేటాయించారు. తమకు మూడు సీట్లు కేటాయించాలని, అదీ రెండు రిజర్వుడు, ఒక అన్ రిజర్వుడు నియోజకవర్గాన్ని కేటాయించాలని డీపీఐ అధినేత తిరుమావళవన్ పట్టుబడుతున్నారు. ఈ కారణంగానే శనివారం ఖరారు కావాల్సిన సీట్ల సర్దుబాట్లు వాయిదా పడ్డాయి. ఇక ఈ కూటమిలోని కాంగ్రెస్ పార్టీ పది నియోజకవర్గాలు కావాలని పట్టుబడుతోంది. ఈ పరిస్థితుల్లో కొత్తగా కూటమిలో చేరిన ఎంఎన్‌ఎంకు సీటు కేటాయించడానికి డీఎంకే అధిష్ఠానం తటపటాయిస్తోంది. కాంగ్రెస్‌కు 8 లేదా 9 సీట్లిచ్చి అందులో ఓ సీటును ఎంఎన్‌ఎంకు కేటాయించేలా డీఎంకే అధిష్ఠానం ప్రతిపాదిస్తోంది. ఈ ప్రతిపాదనను చూసి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు విస్మయం చెందారు. ఈ విషయమై టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై మాట్లాడుతూ... తమకు కేటాయించే నియోజకవర్గాల్లో ఒకదాన్ని ఎంఎన్‌ఎంకు కేటాయించమంటూ డీఎంకే అధిష్ఠానం ఎలాంటి ప్రతిపాదన రాలేదన్నారు. ఇక డీఎంకే సీనియర్ నేతలు ఎవరూ ఎంఎన్‌ఎంకు తమ కూటమిలో ఉందని స్పష్టం చేయలేకపోతున్నారు. దీనిపై డీఎంకే ఎంపీ టీఆర్ బాలు మాట్లాడుతూ... కమల్ నాయకత్వం వహిస్తున్న ఎంఎన్‌ఎంకు తమ కూటమిలో చేర్చుకోవడంపై పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఇటీవల విదేశాల నుంచి తిరిగొచ్చిన కమల్ పార్టీ శ్రేణులతో మాట్లాడుతూ... రెండు రోజుల్లో కూటమి గురించి శుభవార్త వింటారని ప్రకటించారు. వారం దాటినా డీఎంకేతో పొత్తు ఖరారైనట్లు ఆయన ఎలాంటి ప్రకటన చేయలేదు. అంతేకాకుండా ఇప్పటివరకూ డీఎంకే మిత్రపక్షాలతో సీట్ల కేటాయింపుల చర్చలు జరిగాయి. కానీ ఎంఎన్‌ఎం ప్రతినిధులతో కానీ, లేక కమల్‌తోగానీ డీఎంకే ఎన్నికల కమిటీ సభ్యులు చర్చలు జరపలేదు. ఇదంతా ఎంఎన్‌ఎంకు తమ కూటమిలో ఇంకా చేరలేదనడానికి సంకేతాలని డీఎంకే వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో ఈరోడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి మక్కల్ నీదిమయ్యం మద్దతు ప్రకటించిందని, కమల్ ప్రచారం కూడా చేశారని, ఇప్పటివరకూ ఆయన కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారని, కనుక కాంగ్రెస్‌కు కేటాయించే సీట్లలో కమలహాసన్ ఎన్ని సీట్లు పొందినా తమకు అభ్యంతరం లేదని డీఎంకే సీనియర్ నేతలు చెబుతున్నారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతోనూ కమల్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. ఆ పలుకుబడిని ఉపయోగించి కాంగ్రెస్ పొందే సీట్ల నుంచి ఒకటి రెండు సీట్లను కమల్ పొందే అవకాశం ఉందని ఎంఎన్‌ఎం నేతలు పేర్కొంటున్నారు. పది సీట్ల కోసం పట్టుబడుతున్న కాంగ్రెస్ తొమ్మిది సీట్లే ఇస్తామని డీఎంకే అధిష్ఠానం చెబుతుండటంతో ఆ సీట్లలో ఒకటి రెండు సీట్లను మక్కల్ నీదిమయ్యం కేటాయిస్తుందని ఆ పార్టీ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదీ ఏమైనప్పటికీ మక్కల్ నీదిమయ్యం నేత కమల్ ప్రస్తుతం తమ పార్టీ డీఎంకే కూటమిలో ఉందో లేదో? లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి తమకు సీట్లను డీఎంకే కేటాయిస్తుందా లేక కాంగ్రెస్ కేటాయిస్తుందో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారనడం అతిశయోక్తి కాదు.

అదనపు సీట్ల కోసం మూడు పార్టీల పట్టు

● డీఎంకే కూటమిలో ప్రతిష్టంభన ● చర్చలకు రానున్న ఖర్గే


మల్లికార్జున ఖర్గే

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సహా మూడు పార్టీలు అదనపు సీట్ల కోసం పట్టుబడుతుండటంతో డీఎంకే కూటమిలో తీవ్ర ప్రతిష్టంభన కొనసాగుతోంది. అదే సమయంలో డీఎంకే అధిష్ఠానంతో చర్చలు జరిపి సీట్లను ఖరారు చేసుకునే నిమిత్తం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నగరానికి రానున్నారు. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌తో ఆయన చర్చించనున్నారు. ఇక కూటమిలో మరో మిత్రపక్షమైన డీపీఐకి సీట్ల కేటాయింపులు ఖరారు కానున్న తరుణంలో ఉన్నట్టుండి శనివారం జరగాల్సిన రెండో విడత చర్చలు వాయిదా పడ్డాయి. లోక్‌సభ ఎన్నికల సమీపిస్తుండడంతో ఇటు డీఎంకే, అటు అన్నాడీఎంకే, బీజేపీలు బలమైన కూటమితో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నాయి. ఎన్డీయే కూటమి నుంచి వైదొలగిన అన్నాడీఎంకే కూటమిలో పీఎంకే, డీఎండీకేలు చేరే అవకాశాలున్నాయి. బీజేపీ కూటమిలో చేరడానికి చిన్నా చితక పార్టీలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో డీఎంకే కూటమి నుంచి కొన్ని మిత్రపక్షాలు వైదొలగి తమ కూటమిలో చేరుతాయని అన్నాడీఎంకే సీనియర్ నేతలు జోస్యం చెప్పినట్లుగానే మూడు ప్రధాన పార్టీలు అదనపు సీట్ల కోసం పట్టుబడుతున్నాయి. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీపీఐ, ఎండీఎంకే, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీలున్నాయి. కమ్యూనిస్టు పార్టీలకు తలా రెండు నియోజకవర్గాలు, ముస్లింలీగ్‌కు రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గం, కొంగునాడు మక్కల్ దేశీయకట్చికి నామక్కల్ నియోజకవర్గాన్ని కేటాయించారు. రాష్ట్రంలోని 39 సీట్లకు గాను డీఎంకే ఆరు సీట్లను మిత్రపక్షాలకు కేటాయించింది. ఇక కాంగ్రెస్, డీపీఐ, ఎండీఎంకేకు సీట్ల కేటాయింపులపై చర్చలు కొనసాగుతున్నాయి. వైగో నాయకత్వంలోని ఎండీఎంకే మూడు విడతలుగా సీట్ల కేటాయింపు కమిటీతో చర్చలు జరిపింది. రెండు విడతల చర్చల్లో రెండు లోక్‌సభ నియోజకవర్గాలు, రాజ్య సభ సీటు కేటాయించాలని పట్టుబట్టింది. మూడో విడత చర్చల్లో పట్టు సడలించి ఒక లోక్‌సభ, ఒక రాజ్యసభ సీటు కేటాయిస్తే చాలునని పేర్కొంది. ఇదే విధంగా డీపీఐ కూడా ఫిబ్రవరి 12న చర్చల కమిటీతో మొదటి విడత చర్చించింది. రెండో విడత చర్చలకు ఈ నెల 2న రమ్మంటూ డీఎంకే అధిష్ఠానం ఆహ్వానించింది. చివరి క్షణంలో చర్చలకు వెళ్ళకుండా డీపీఐ నేత తిరుమా మీడియాతో మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో మూడు సీట్లలో పోటీ చేయాలని తమ పార్టీ భావిస్తోందన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో చిదంబరం, విల్లుపురం నియోజవకార్గలలో పోటీ చేసిన డీపీఐ ప్రస్తుతం మూడు సీట్ల కోసం పట్టుబడుతోంది. ఇక కూటమిలో పెద్దపార్టీగా ఉన్న కాంగ్రెస్‌తో సీట్ల పంపకంపై తొలి విడత చర్చలు గత జనవరి 28న జరిగాయి. ఆ తర్వాత మలి విడత చర్చలు జరగలేదు. ఈలోగా టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా సీఎల్పీ నేత సెల్వపెరుందగై నియమితులయ్యారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పుదుచ్చేరి సహా 10 నియోజకవర్గాలలో పోటీ చేసి తొమ్మిది నియోజకవర్గాల్లో గెలిచింది. తేని నియోజకవర్గంలో మాత్రమే ఓటమి పాలైంది. తొలి విడత చర్చల సందర్భంగా మునుపటి కంటే ఎక్కువ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేసింది. 12 సీట్లివ్వాలని కోరింది. అటుపిమ్మట మలి విడత చర్చలు జరుగలేదు. ఎనిమిది లేదా తొమ్మిది నియోజకవర్గాలను మాత్రమే కేటాయిస్తామని డీఎంకే తేల్చిచెప్పింది. అంతేకాకుండా కాంగ్రెస్‌కు కేటాయించే సీట్లలో ఒకటి లేదా రెండు సీట్లను మక్కల్ నీదిమయ్యంకు కేటాయించమంటూ డీఎంకే పెట్టిన మెలికకు రాష్ట్ర కాంగ్రెస్ నేతలంతా ఖంగుతిన్నారు. ఈ పరిస్థితులలో సీట్ల కేటాయింపులపై చర్చలు జరిపేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వచ్చేవారం నగరానికి విచ్చేయనున్నారని టీఎన్‌సీసీ నేతలు చెబుతున్నారు. సీట్ల కేటాయింపుల్లో కాంగ్రెస్, డీఎంకే మధ్య ఏర్పడిన ప్రతిష్టంభనను ఆయన తొలగిస్తారని తెలిపారు. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌తో ఖర్గే మలి విడత చర్చలు జరిపి సీట్ల కేటాయింపులను ఖరారు చేస్తారని పేర్కొన్నారు.

కళాపోషకులకు చరిత్రలో సుస్థిర స్థానం

● మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ ● ఘనంగా శ్రీ కళాసుధ 'శివరాత్రి సంగీత మహోత్సవం' ● ఆహూతులను ఉర్రూతలూగించిన నాగరాజు 'వేణుగానం'

అడయార్, మార్చి 3: కళలను పోషించేవారు చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోతారని, అలాంటి వారిలో శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ ఒకరని ఏపీ శాసనసభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆళ్వార్‌పేటలోని మ్యూజిక్ అకాడమీలో 'శివరాత్రి సంగీత మహోత్సవం' జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు నాగరాజు తాళ్ళూరి బృందం 'వేణుగాన సమ్మోహనం' పేరుతో సంగీత విభావరి నిర్వహించింది. ఇందులో నాగరాజు బృందం వేణుగానం ఆహూతులను తన్మయత్వంలో ముంచెత్తింది. ఈ సందర్భంగా నాగరాజుకు శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ నిర్వాహకులు ఘనంగా సన్మానించి బంగారు కిరీట ధారణ చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ... తాను దివంగత సీఎం వైఎస్, సీఎం ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వాల్లో కళాకారులకు కళారత్న పురస్కారాలను ప్రదానం చేసేందుకు అర్హులైన వారిని ఎంపిక చేసే బాధ్యతలను నిర్వహించానని, ఆ సమయంలోనే నాగరాజును 'ఏపీ ప్రభుత్వం కళారత్నం' పురస్కారానికి ఎంపిక చేసిందన్నారు. ఆయన 'పద్మశ్రీ' వంటి పురస్కారాలను అందుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదిత్యారామ్ ఫిల్మ్ సిటీ అధినేత ఆదిత్యారాం మాట్లాడుతూ... ఈ రోజు తమ వివాహ వార్షికోత్సవం అయినప్పటికీ ఈ కార్యక్రమానికి రావాలన్న పట్టుదలతో ఇక్కడికి తమ దంపతులం వచ్చామన్నారు. ఈ ప్రత్యేకమైన రోజున నాగరాజు సంగీతంలో పరవశించి పోయామన్నారు. జీవితంలో మూడు తేదీలను ప్రతి ఒక్కరూ తప్పకుండా గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఒకటి పుట్టిన రోజని, ఇది మన తల్లిదండ్రులు చెబితేనే తెలుస్తుందన్నారు. రెండో మరణ తేదీ. ఈ తేదీ గురించి అస్సలు తెలుసుకునే అవకాశం లేదన్నారు. మూడోది పెళ్లిరోజన్నారు. ఈ తేదీని మాత్రం భర్తలు ప్రత్యేకంగా గుర్తుపెట్టుకుని తమ సతీమణులను ఆనందపరచాలన్నారు. ఆ కోవలోనే తాను తన సతీమణికి ఆదిత్యారాం ఫిల్మ్ ప్యాలెస్‌ను బహుమతిగా ఇచ్చానన్నారు. హిమాలయ పర్వతాల కంటే ఎత్తైన జీవిత లక్ష్యంతో 15 యేళ్లుగా పనిచేశానని, ఫలితంగా దక్షిణ భారతదేశంలోనే 27 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద ఫిల్మ్ సిటీని నిర్మించి, బిలియనీర్‌గా మారాలన్న లక్ష్యాన్ని కూడా దాదాపుగా చేరుకున్నట్టు తెలిపారు. ఇలాంటి పర్వదినాన తమ దంపతులకు సన్మానం చేసిన బేతిరెడ్డి శ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. 'పాడుతా తీయగా' రన్నరప్ పవిత్ర ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా దక్షిణామూర్తి వ్యవహరించారు. శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు స్వాగతోపన్యాసం చేయగా ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత ఏఎం రత్నం, నేపథ్య గాయకుడు శ్రీనివాస్, ఎస్‌బీఐ చెన్నై సర్కిల్ జీఎం మురళీకృష్ణ, ప్రముఖ గాయకుడు ఉన్నికృష్ణన్, వీజీఎన్ గ్రూపు డైరెక్టర్ పద్మ దేవదాస్, సినీ నేపథ్యగాయని ఎస్పీ శైలజ సహా పలువురు తెలుగు ప్రముఖులు, శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


నాగరాజు వేణుగాన సంగీత విభావరి


'కళారత్న' నాగరాజుకు బంగారు కిరీట ధారణ చేస్తున్న మండలి బుద్ధ ప్రసాద్, ఆదిత్యారాం, ఏఎం రత్నం, ఎస్పీ శైలజ తదితరులు

సమాచార దర్శిని

యూట్యూబ్ ఛానల్‌పై శిక్షణ

పెరంబూర్, మార్చి 3: తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యూట్యూబ్ ఛానల్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. స్థానిక ఈకాట్టు తాంగల్‌లోని సంస్థ కార్యాలయంలో ఈనెల 7నుంచి 9వ తేది వరకు, వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో 11 నుంచి 13వ తేది వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న శిక్షణ తరగతుల్లో ఛానల్ ప్రారంభం, వీడియోల చిత్రీకరణ, అప్‌లోడ్ తదితరాలను వివరించనున్నారు. ఈ శిక్షణలో 18 ఏళ్ల పూర్తయిన వారు www.editn.in అనే వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదుచేసుకోవచ్చు. వివరాలకు నెం.8668102600, 8668100181, 7010143022, 9841336033లలో సంప్రదించవచ్చు.

రేపు నాలుగు ప్రాంతాల్లో విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, మార్చి 3: స్థానిక మైలాపూర్, కేకే నగర్, అంబత్తూర్, తండయార్‌పేట ప్రాంతాల్లో ఈనెల 5వ తేది ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమావేశాలు జరగనున్నాయి.

● మైలాపూర్: నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, 110/33 కిలోవాట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణం, వళ్లవర్‌కోట్టం, నుంగంబాక్కం, చెన్నై-34

● కేకే నగర్: నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, నెం.1, అన్నా మెయిన్ రోడ్డు, 110/33 విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం 2వ అంతస్తు, కేకే నగర్, చెన్నై-78

● అంబత్తూర్: నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, 3వ మెయిన్ రోడ్డు, విద్యుత్ సబ్‌స్టేషన్, అంబత్తూర్ ఎస్టేట్, చెన్నై-58

● తండయార్‌పేట: నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, నెం.805, తిరువొత్తియూర్ హైరోడ్డు, మణీగుండు ఎదురు, చెన్నై-21. ఈ శిబిరాల్లో వినియోగదారులు పాల్గొని విద్యుత్ సంబంధిత సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు తెలిపింది.

రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.1,812 కోట్ల ఆదాయం

పెరంబూర్, మార్చి 3: రిజిస్ట్రేషన్ల ద్వారా ఫిబ్రవరిలో రూ.1,812.70 కోట్ల ఆదాయం లభించింది. అదే సమయంలో 2023 ఫిబ్రవరి రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.1,593.95 కోట్లు సమకూరగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.218.74 కోట్లు అదనంగా ఆదాయం వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి వరకు రూ.16, 653.32 కోట్ల ఆదాయం సమకూరింది. ఇదే గత ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి వరకు రూ.15,481.72 కోట్లు రాగా, ఈ ఆదాయం పోల్చితే ప్రస్తుతం రూ.1,171.60 కోట్లు (7.57 శాతం అదనం) అదనంగా చేకూరిందని రిజిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి జ్యోతినిర్మలాస్వామి తెలిపారు.

అంగన్వాడీ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

పెరంబూర్, మార్చి 3: అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకుంటూ ఐదేళ్ల పూర్తయిన పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కుమరగురుపన్ లేఖ రాశారు. అంగన్వాడీలో చదువు పూర్తయిన పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులను సంప్రదించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యా బోధన, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు తదితరాలను తల్లిదండ్రులకు వివరించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలని కార్యదర్శి లేఖలో సూచించారు.

25నుంచి రేషన్ ఉద్యోగుల సమ్మె

పెరంబూర్, మార్చి 3: తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈనెల 25వ తేది నుంచి రేషన్ ఉద్యోగులు సమ్మె చేపట్టనున్నారు. రాష్ట్రంలోని 4,500 ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘాల ద్వారా 32,000 రేషన్ దుకాణాలు పని చేస్తున్నాయి. రేషన్ ఉద్యోగులు సాయంత్రం 6 గంటల తర్వాత ఇంటింటికి వెళ్లి, కార్డుదారుల వేలిముద్రల నమోదు చేయాలని నిర్బంధం చేస్తున్నారని, ఈ ప్రక్రియ రద్దు చేయాలని, పంట రుణాల చెల్లింపులో నిబంధనలు ఉల్లంఘించారని, మాజీ ఉద్యోగులకు పదవీ విమరణ రాయితీలు అందించకుండా వేధిస్తున్నారని, పింఛన్ అందించాలని తదితర డిమాండ్ల సాధనకు ఈనెల 11వ తేది జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనలు, అప్పటికీ ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈ నెల 25వ తేది నుంచి సమ్మె చేపడతామని సహకార సంఘాల రిజిస్ట్రార్‌కు నోటీసు అందజేసినట్లు రేషన్ ఉద్యోగుల సంఘాల సమాఖ్య తెలిపింది.

ఏప్రిల్ 15లోపు బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

పెరంబూర్, మార్చి 3: రాష్ట్రంలో ఏప్రిల్ 15వ తేది లోపు 4జీ నెట్ వర్క్ సేవలు ప్రారంభించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ తమిళ్‌మణి తెలిపారు. రామేశ్వరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని 6,000 బీఎస్ఎన్ఎల్ టవర్లు 3జీ నుంచి 4జీ నెట్‌వర్క్‌కు మార్చే పనులు జరుగుతున్నాయన్నారు. 200 గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ప్రైవేటు సంస్థలు 5జీ సేవల కన్నా బీఎస్ఎన్ఎల్ అందించే 4జీ సేవలు వేగవంతంగా ఉంటాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4,65,000 మంది తన కనెక్షన్లు 4జీ నెట్‌వర్క్‌కు మార్చుకొనేందుకు దరఖాస్తు చేసుకున్నారని, వినియోగదారులు తమ 3జీ సిమ్‌కార్డును బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాల్లో ఉచితంగా 4జీగా మార్చుకోవచ్చని ఆయన తెలిపారు.

నాలుగు స్వదేశీ విమానాల రద్దు

ఐసిఎఫ్, మార్చి 3: స్థానిక విమానాశ్రయం నుంచి నాలుగు స్వదేశీ విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఢిల్లీ - చెన్నై - ఢిల్లీ, ముంబై- చెన్నై - ముంబై మధ్య నాలుగు విస్తారా విమానాలు హఠాత్తుగా రద్దు చేశారు. రద్దుకు తగిన కారణాలు సదరు సంస్థ తెలియజేయలేదని ప్రయాణికులు ఆరోపించారు.

డబ్ల్యూటీఎఫ్ ఆధ్వర్యంలో 16న మహిళా దినోత్సవాలు

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 16న మహిళా దినోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్ తెలిపారు. పీవీ చెరియన్‌రోడ్డులోని కేసీపీ కార్యాలయంలో నిర్వహించే ఈ వేడుకల్లో ఐకేఎస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సి.శోభారాజును సత్కరించనున్నామని తెలిపారు. ఆ తర్వాత సంగీత సాహితీ చంద్ర డాక్టర్ సాయికృష్ణ యాచేంద్ర సంగీత గేయధార జరుగుతుందని, ప్రాశ్నికులుగా డాక్టర్ లలిత, టి. మోహనశ్రీ, కమలాకార రాజేశ్వరి, లావణ్య గాదె, గోపికా పూర్ణిమ, సి. శోభారాజు వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాలు ముగిసిన తర్వాత సాయంత్రం 6 గంటలకు తేనీటి విందు కూడా ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు.

కవిత్రయ మహాభారతంపై నేటినుంచి అంతర్జాతీయ సదస్సు

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'కవిత్రయ మహాభారతం - వర్తమాన సమాజం: సమాలోచనం అనే అంశంపై ఆదిపర్వం నుంచి స్వర్గారోహణ పర్వం దాకా 16 సమావేశాలు, సమాపనోత్సవంతో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ఈనెల 4న ప్రారంభమవుతుంది.

మొదటి రోజు సదస్సు వివరాలు...

రజతోత్సవ ప్రాంగణంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఆదిపర్వంపై తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన సదస్సు ప్రారంభోత్సవం జరుగుతుంది. ఈ ప్రారంభోత్సవానికి అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, నగరానికి చెందిన ఆధ్యాత్మికవేత్త కె.ఆనందకుమార్‌రెడ్డి విశిష్ట అతిథిగా, జర్మనీ ఎస్‌ఆర్‌హెచ్ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య గణేష్ తొట్టెంపూడి ప్రత్యేక అతిథిగా, వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు గౌరవ అతిథిగా, తెలుగు భాషా సేవకురాలు డాక్టర్ ఏవీ శివకుమారి, ఆఫ్రికా బోత్సువానాకు చెందిన ఆచార్య శ్రీదేవి శ్రీకాంత్, ఏలూరు చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు పూర్వ సంచాలకుడు మహా సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ కీలకోపన్యాసం చేస్తారు. భోజన విరామం తర్వాత మధ్యాహ్నం 2గంటలకు సభాపర్వంపై ఏర్పాటయ్యే మొదటి సమావేశం తిరువూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్ వై. విజయానందరాజు అధ్యక్షత వహిస్తారు. కవిత్రయ మహాభారతం - వక్తిత్వ వికాసం అనే అంశంపై పెద్దాడ సాయి సూర్యసుబ్బలక్ష్మి, ఆంధ్ర మహాభారతము - ఆదిపర్వం - ఆచరణీయ సామాజిక విలువలు అనే అంశంపై డాక్టర్ పులపర్తి పైడిరాజు, ఆంధ్ర మహాభారతం - ఏకలవ్యుని గురుభక్తి అనే అంశంపై డాక్టర్ కల్యాడపు రమేశ్, కవిత్రయ మహాభారతం - సామ, దాన, భేద, దండ చాతుర్యం అనే అంశంపై ముక్కామల సాయిఅనిరుధ్ ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు అరణ్యపర్వంపై నన్నయ రాజనీతి నేటి ప్రభుత్వ వ్యవస్థ అనే అంశంపై ఏర్పాటయ్యే రెండో సమావేశానికి రేపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖాధ్యక్షుడు డాక్టర్ కట్టెపోగు సురేష్‌కుమార్ అధ్యక్షత వహించనున్నారు. మహాభారతం - మానవగుణతత్త్వం అనే అంశంపై డాక్టర్ కొండా రవి, మహాభారతంలో కుటుంబ వ్యవస్థ అనే అంశంపై డాక్టర్ బి.తేజోవాణి, ఆంధ్ర మహాభారతం- సప్త వ్యసనాలు- వర్తమాన సమాజం- పర్యవసానాలు అనే అంశంపై డాక్టర్ కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి, మహాభారతం కాలం నాటి - ఆశ్రమ, సాంఘిక జీవితాలు - నేటి యువతకు ఆదర్శాలు అనే అంశంపై డాక్టర్ పప్పుల వెంకటరమణ ప్రసంగిస్తారు. సాయంత్రం 4 గంటలకు విరాటపర్వంపై ఏర్పాటయ్యే మూడో సమావేశానికి నందిగామ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖాధ్యక్షుడు డాక్టర్ చాట్ల కిశోర్ కుమార్ అధ్యక్షత వహిస్తారు. మమాభారతం - విశ్వశ్రేయస్సు అనే అంశంపై డాక్టర్ ఎన్.భీమన్న, నన్నయ భారతంలోని సామాజిక స్పృహ - సమాలోచన అనే అంశంపై డాక్టర్ కనుకుర్తి ఈశ్వరమ్మ, కవిత్రయ భారతం - సామాజిక హితబోధ అనే అంశంపై డాక్టర్ ఆర్. విజయకుమారి, నన్నయ భారతం - వ్యక్తిత్వ వికాసానికి ప్రతీక అనే అంశంపై యం.భీమయ్య ప్రసంగిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఉద్యోగపర్వంపై ఏర్పాటయ్యే నాలుగో సమావేశానికి విజయవాడ రంగస్థల నటులు, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. కవిత్రయ మహాభారతంలో ద్రౌపది మనో విశ్లేషణ అనే అంశంపై డాక్టర్ కనకదుర్గ వడ్లమాని, అంబోపాఖ్యానం - వర్తమాన సమాజం సమాలోచనలు అనే అంశంపై డాక్టర్ టి.రాజశేఖర్, కవిత్రయ మహాభారత నాటకాలు - సామాజిక దృక్పథాలు అనే అంశంపై డాక్టర్ చుక్కా యశోద ప్రసంగిస్తారు.

రెండో రోజు...

ఈ నెల 5 ఉదయం 9 గంటలకు భీష్మపర్వం, తిక్కనగీత - మానవీయ గీత అనే అంశంపై ఐదో సమావేశం హైదరాబాద్ యోగాలయా రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ విశ్వర్షి వాసిలి వసంతకుమార్ అధ్యక్షతన ప్రారంభమవుతుంది. తిక్కన మహాభారత శాంతిపర్వం - భీష్మ సందేశం అనే అంశంపై డాక్టర్ కె.వి. సత్యనారాయణ, వీరభీష్మ - ఆదర్శనీయ వ్యక్తిత్వం అనే అంశంపై ఎస్ శశికళ, భారతంలోని నాయకత్వ లక్షణాలు - నేడు వాటి ప్రాధాన్యత అనే అంశంపై సాకే హరిభక్త భానుశ్రీ, ఆంధ్రమహాభారతం - నేటి ఆధునిక జీవితం - ప్రేమ, ఒత్తిడి అనే అంశంపై పొందుగుల బాలు భీంరావ్ ప్రసంగిస్తారు. ఉదయం 10 గంటలకు ద్రోణపర్వంపై ఆంధ్రమహాభారతం - మానవతా విలువలు - మన సమాజ ప్రతిఫలనం అనే అంశంపై ఆరో సమావేశం జరుగుతుంది. ఆంధ్రమహాభారతం - గురుశిష్య సంబంధాలు అనే అంశంపై బొమ్ము మహాలక్ష్మి, కవిత్రయ భారతం - ధర్మరాజు స్వభావచిత్రణ అనే అంశంపై డాక్టర్ మల్లెపోగు మాదన్న, మహాభారతం - పద్దెనిమిది పర్వాలు - విశేషాలు అనే అంశంపై డాక్టర్ వి. వెంకటేశ్వర్లు, భారతం అభ్యుదయ భావుకత అనే అంశంపై డాక్టర్ టి. పార్థసారధి ప్రసంగిస్తారు. ఉదయం 11 గంటలకు కర్ణపర్వంపై ఉద్యోగపర్వం - విదుర నీతి అనే అంశంపై ఏర్పాటయ్యే ఏడో సమావేశానికి పెరంబూరు తెలుగు సాహితీ సమితి కార్యదర్శి డాక్టర్ టీఆర్ఎస్ శర్మ అధ్యక్షత వహిస్తారు. మహాభారతం వర్తమాన సమాజం తులనాత్మక విశ్లేషణ అనే అంశంపై డాక్టర్ ఆరవల్లి జగన్నాధస్వామి, శ్రీమదాంధ్ర మహాభారతం - ఆదిమ గిరిజన తెగల ప్రస్తావన అనే అంశంపై డాక్టర్ నూనావత్ రాంబాబు, ప్రజలు మెచ్చిన ధర్మరాజు అనే అంశంపై డాక్టర్ ఐ.వి. కాంతలక్ష్మి, మహాభారతంలో యోగ దర్శనం - ఒక విశ్లేషణ అనే అంశంపై డాక్టర్ నగిరి చాముండేశ్వరరావు ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు శల్యపర్వంపై ఎర్రన అరణ్యపర్వభాగంలో యక్షప్రశ్నలు అనే అంశంపై జరిగే ఎనిమిదో సమావేశానికి తెలుగు భాషా సేవకురాలు డాక్టర్ తిరుమల ఆముక్తమాల్యద అధ్యక్షత వహిస్తారు. కవిత్రయ భాతరం - రాజధర్మం అనే అంశంపై డాక్టర్ ఎన్. మురళి, డాక్టర్ సి. సుకుమార్ రెడ్డి, కవిత్రయ భారత సంభాషణా నైపుణ్యం - వర్తమాన సమాజం - సమాలోచన అనే అంశంపై డాక్టర్ జడా సుబ్బారావు, మహాభారతంలో యయాతి హితవు - సామాజిక విశ్లేషణ అనే అంశంపై డాక్టర్ పలివెల చిరంజీవిరావు, ఆంధ్రమహాభారతం కుటుంబ వ్యవస్థ ఆధునికి జీవనం అనే అంశంపై కొమరం అనిత ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు సౌప్తికపర్వంపై మహాభారతం - వర్తమాన విద్యారీతులు అనే అంశంపై ఏర్పాటయ్యే తొమ్మిదోసమావేశానికి రాజధాని కళాశాల తెలుగు శాఖకు చెందిన డాక్టర్‌ఎం. మురళి అధ్యక్షత వహిస్తారు. ఆంధ్ర మహాభారతంలోని సౌప్తిక పర్వ వైశిష్ట్యం అనే అంశంపై గరిక రమేష్‌బాబు, మహాభారతం నేటి మానవ స్వభావాలు అనే అంశంపై డాక్టర్ జి. నళిని, ఆంధ్రమహాభారతంలో అబ్బురపరిచే మానవీయ విలువలు - ఆచరణ యోగ్యములు అనే అంశంపై డాక్టర్ భూక్యజ్యోతి, కవిత్రయ మహాభారతం - అరిషడ్వర్గాలు - ఆవశ్యకత అనే అంశంపై డాక్టర్ బి. పావని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు స్త్రీ పర్వంపై జరిగే పదో సామవేశానికి రాజధాని కళాశాల విశ్రాంత తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ ఏ. అంబ్రుణి అధ్యక్షత వహిస్తారు. కవిత్రయ మహాభారతం - విశిష్టస్త్రీలు - పరిశీలన అనే అంశంపై డాక్టర్ జి. శ్రీనివాస్, మహాభారతంలో మాతృమూర్తులు : ప్రణాళిక అనే అంశంపై డాక్టర్ జాడ సీతాపతిరావు, మహాభారతంలో ద్రౌపది పాత్ర మనస్తత్వ చిత్రణ అనే అంశంపై యు. లావణ్య, నేటి మహిళలకు 'గాంధారి' ఆదర్శమేనా? అనే అంశంపై డాక్టర్ గుంటుపల్లి గౌరి ప్రసంగిస్తారు. సాయంత్రం 4 గంటలకు శాంతిపర్వంపై మహాభారతం సత్య ప్రాధాన్యం అనే అంశంపై జరిగే పదకొండో సమావేశానికి రాజధాని తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎన్. ఎలిజబెత్ జయకుమార్ అధ్యక్షత వహిస్తారు. మహాభారతంలోని సంజయ రాయభారం - వర్తమాన సమాజం అనే అంశంపై అన్నపూర్ణ బత్తుల, మహాభారతంలోని ధర్మమార్గములు - వాటి ఆవశ్యకత అనే అంశంపై కైపు యర్రారెడ్డి, కవిత్రయ భారతం పాత్రలు - మనస్తత్వ చిత్రణ అనేఅంశంపై రామాపురం శ్రీనివాసులు, బి. రజని, మహాభారత ఉపాఖ్యానములు - మానవ స్వభావ చిత్రణ అనే అంశంపై డాక్టర్ లింగాల మంగమ్మ ప్రసంగిస్తారు. సాయంత్రం 6 గంటలకు అనుశాసనిక పర్వంపై అనుశాసనిక పర్వం - ఆధునిక సమాజం- విశ్లేషణ అనే అంశంపై జరిగే పన్నెండో సమావేశానికి మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు చెందిన డాక్టర్ పాండురంగం కాళియప్ప అధ్యక్షత వహిస్తారు. కవిత్రయ మహాభారంత - ఆధునిక మానవుని మనస్తత్త్వం అనే అంశంపై డాక్టర్ శ్రీను కెతావత్, తిక్కన భారతం - మానవ సంబంధాలు అనే అంశంపై డాక్టర్ భూక్య తిరుపతి, అనుశాసనిక పర్వం దాన విశేషాలు అనే అంశంపై పి. రమేష్‌బాబు, నన్నయ 'యయాతి చరిత్ర' కథ - వర్తమాన సమాజానికి బోధిచంప నీతి అనే అంశంపై షేక్ జరీనా ప్రసంగిస్తారు.

మూడోరోజు...

ఈ నెల 6న ఉదయం 9 గంటలకు అశ్వమేధ పర్వంపై మహాభారతం 'కర్ణుడు' - వర్తమాన సమాజం- ఆదర్శ జీవన విలువలు అనే అంశంపై ఏర్పాటయ్యే పదమూడో సమావేశానికి మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు చెందిన డాక్టర్ మాదా శంకరబాబు అధ్యక్షత వహిస్తారు. నన్నయ్య సభాపర్వంలోని సూక్తులు నేటి ఉపయోగం అనే అంశంపై డాక్టర్ అద్దంకి ప్రజాపతి, సినీ రచనల్లో మహాభారతం (పాటలు మరియు సంభాషణలు) అనే అంశంపై డాక్టర్ ఉడాలి విష్ణుప్రియ, కవిత్రయ భారతం - ఆధునిక సమాజం : స్త్రీ స్థితిగతులు అనే అంశంపై కిడాంబి శ్రావణి, నన్నయ భారతంలో నాటకీయత అనే అంశంపై డాక్టర్ జె. భారతి ప్రసంగిస్తారు. ఉదయం 10 గంటలకు ఆశ్రమవాసం, కవిత్రయ భారతంలో ధృతరాష్ట్రుడి పాత్ర చిత్రణ : విశ్లేషణ అనే అంశంపే జరిగే పద్నాలుగో సమావేశానికి మదురై విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ అధ్యక్షత వహిస్తారు. ఆశ్రమవాసపర్వం - ఆధునిక సమాజం అనే అంశంపై ఆచార్య విస్తాలి శంకరరావు, నన్నయ శకుంతలోపాఖ్యానం - గృహస్థాశ్రమ విశిష్టత అనే అంశంపై డాక్టర్ పొట్లూరి శ్రీనివాసరావు, నాటి యయాతి - నేటి దృక్కోణాలు అనే అంశంపై డాక్టర్ యం రమాదేవి, ప్రమద్వరోపాఖ్యానం - వర్తమాన సమాజం - సమాలోచనలు అనే అంశంపై డాక్టర్ సింగమాల చంద్రయ్య ప్రసంగిస్తారు. ఉదయం 11 గంటలకు మౌసల పర్వంపై తిక్కన భారతం - ధౌమ్య ధర్మోపదేశాలు అనే అంశంపై జరిగే పదిహేనో సమావేశానికి తిరుపతి శ్రీగోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖకు చెందిన డాక్టర్ పట్టపు శివకుమార్ అధ్యక్షత వహిస్తారు. శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వాములవారి గీతాభక్తితత్త్వం అనే అంశంపై డాక్టర్ ఎం. దీనదయాళ్, శకుంతల దుష్యంతుల కథ - సార్వకాలికం అనే అంశంపై దేవిశెట్టి రామన్న, పి. హరీష్‌బాబు, సార్వకాలిక సామాజిక ప్రతిబింబం - కీచక వధ కథాభాగం అనే అంశంపై డాక్టర్ కెవిఎన్‌డి వరప్రసాద్, తిక్కన కవిత - నాట్య శాస్త్ర మర్యాదలు అనే అంశంపై డాక్టర్ నందవరం మృదుల ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు మహాప్రస్థానిక పర్వంపై ఏర్పాటయ్యే పదహారో సమావేశానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు చెందిన డాక్టర్ బూసి వెంకటస్వామి అధ్యక్షత వహిస్తారు. వ్యాఘ్రగోమాయ సంవాదం - సౌమ్యుల అసౌమ్యుల వివిక్షత అనే అంశంపై డాక్టర్ నూకల విజయలక్ష్మి, సత్యాద్రౌపదీ సంవాదం - ద్రౌపది దాంపత్య ధర్మం అనే అంశంపై డాక్టర్ సంగీతరావు మెడతోటి, కవిత్రయ మహాభారతం - వర్తమాన సమాజం - సమాలోచన అనే అంశంపై డాక్టర్ జి. లక్ష్మీనారాయణ ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వర్గారోహణ పర్వంపై ఏర్పాటయ్యే సమాపనోత్సవ సభకు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తారు. విశిష్ట అతిథిగా సుప్రీం కోర్టు న్యాయవాది డాక్టర్ అద్దేపల్లి పురుషోత్తం, ప్రత్యేక అతిథిగా తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర పాల్గొంటారు. గౌరవఅతిథిగా మీనాక్షి కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్, కేవీ రమణమ్మ పాల్గొని ప్రత్యేక సంచిక తొలి ప్రతిని స్వీకరిస్తారు. ఆత్మీయఅతిథులుగా జేఎస్ చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఎం.వీ. నారాయణ గుప్తా, అమెరికాకు చెందిన రచయిత్ర మాధురి ఇంగువ పాల్గొంటారు. హైదారాబాద్ యోగాలయ రీసెర్చ్ సెంటర్ డాక్టర్ విశ్వర్షి వాసిలి వసంతకుమార్ స్పందనను తెలియజేస్తారు. రాజధాని కళాశాల విశ్రాంతాచార్యులు ఆచార్య ఎల్‌బి శంకరరావు సమాపనోత్సవ సందేశమిస్తారు.

ఇంట్లో టపాకాయలు పేలి ఒకరి మృతి

● మరొకరికి గాయాలు



నేలమట్టమైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా కొక్కులం ప్రాంతంలో ఓ ఇంట్లో భద్రపరచిన బాణసంచా పేలి శక్తీశ్వరన్ అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ ఇంట్లో లైసెన్స్ లేకుండా బాణసంచా తయారు చేస్తున్నారని, ఆదివారం ఉదయం ఉన్నట్టుండి టపాకాయలకు నిప్పంటుకుని పేలుడు సంభవించిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో బాణసంచా దాచిన ఇల్లు నేలమట్టమైంది. ఆ ఇంటి పక్కనే ఉన్న ఇళ్ల పైకప్పుల్లో పగుళ్లు ఏర్పడ్డాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రధాని మోదీ తీరును నిరసిస్తూ డీఎంకే వినూత్న ధర్నా



ప్రజలకు వడలు అందిస్తున్న డీఎంకే శ్రేణులు

పెరంబూర్, మార్చి 3: కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి నగర డీఎంకే ఆధ్వర్యంలో ప్రధాని మోదీ తీరును నిరసిస్తూ వినూత్న ధర్నా చేపట్టారు. ఆ పార్టీ నగర కార్యదర్శి నవనీత్ కృష్ణన్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కార్యకర్తలు మోదీ చిత్రపటాన్ని మాస్కుగా ధరించి ప్రజలకు ఉచితంగా వడలు అందజేశారు. ఎన్నికల హామీలను మోదీ నెరవేర్చలేదని, ప్రజల బ్యాంక్ ఖాతాల్లో రూ15 లక్షలు జమ చేస్తామని కల్లబొల్లి హామీలు గుప్పించారని, మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణం ఇప్పటివరకు ప్రారంభించ లేదని డీఎంకే శ్రేణులు నినాదాలు చేశారు.

విరిగిన ఆలయ ధ్వజస్తంభం



పెరంబూర్, మార్చి 3: బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా ధ్వజారోహణం చేస్తుండగా ధ్వజస్తంభం విగిరిపడడం భక్తులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. కారైక్కాల్ సమీపం తిరునల్లారు శ్రీ దర్బారణేశ్వర ఆలయానికి చెందిన శ్రీ నలపుర నాయకి సమేత శ్రీ నల నారాయణ పెరుమాళ్ ఆలయాన్ని ప్రతిరోజు భక్తులు పెద్దసంఖ్యలో సందర్శిస్తుంటారు. ఈ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు పూజలు నిర్వహించారు. అనంతరం పతకావిష్కరణ కోసం ధ్వజస్తంభాన్ని సిద్ధం చేస్తున్న సమయంలో హఠాత్తుగా ధ్వజస్తంభం విరిగిపడింది. ఊహించని ఘటనతో దిగ్భ్రాంతి చెందిన భక్తులు, ధ్వజస్తంభాన్ని సక్రమంగా పర్యవేక్షంచలేదని ఆలయ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ధ్వజారోహణం తాత్కాలికంగా వాయిదావేసిన అధికారులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టే చర్యల్లో దిగారు.

పల్స్ పోలియోలో కలెక్టర్



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మార్చి 3: జిల్లావ్యాప్తంగా ఆదివారం పోలియో చుక్కల శిబిరాలు జరిగాయి. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కల శిబిరాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఐదేళ్లలోపున్న 1,02,680 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు జిల్లావ్యాప్తంగా 922 శిబిరాలు ఏర్పాటుచేశారు. ఈ శిబిరాల్లో 3,692 మంది ఉద్యోగులు, 130 మంది వైద్యులు పాల్గొన్నారని అధికారులు తెలిపారు.

మాజీ ఉపాధ్యాయురాలి శరీరదానం



కావేరి (ఫైల్ ఫొటో)

వేలూరు, మార్చి 3: స్థానిక రాధాకృష్ణన్ నగర్‌లో నివసిస్తున్న కావేరి (92) తన అవయవాలు దానం చేశారు. ఆమె బతికి ఉన్న సమయంలోనే శరీరదానం చేస్తున్నట్లు నమోదు చేశారు. ఆదివారం ఆమె మృతి చెందడంతో కాట్పాడి తాలూకా రెడ్‌క్రాస్ సంఘం నిర్వాహకులు ఆమె మృతదేహాన్ని వేలూరు సీఎంసీ ఆసుపత్రికి అందజేశారు. కార్యక్రమంలో మృతురాలి కుమార్తె విమల, అల్లుడు బాలకృష్ణన్, రెడ్‌క్రాస్ సంఘ అధ్యక్షుడు జనార్దనన్, తులిర్ పాఠశాల హెచ్‌ఎం కనక తదితరులు పాల్గొన్నారు.

రిసార్ట్‌కు బదులుగా అడవిలోకి పంపిన 'గూగుల్ మ్యాప్'



అడవి మార్గంలోకి వెళ్తున్న వారిని ఆపిన అటవీ సిబ్బంది

పెరంబూర్, మార్చి 3: ముదుమలైకు విహారయాత్రకు వెళ్లిన దంపతులు అటవీ ప్రాంతంలోకి వెళ్లిన ఘటన వెలుగు చూసింది. కర్ణాటకకు చెందిన దంపతులు నీలగిరి జిల్లా ఊటీకి విహారయాత్రకు బయల్దేరారు. అందుకోసం వారు కూడలూరు సమీపం తోరపల్లి ప్రాంతంలోని ఓ రిసార్ట్‌ను రిజర్వ్ చేసుకున్నారు. కర్ణాటక నుంచి కారులో రిసార్ట్‌కు బయల్దేరిన వారు గూగుల్ మ్యాప్ సాయం తీసుకున్నారు. తోరపల్లి చెక్‌పోస్ట్ దాటి అడవి మార్గంలోకి వెళుతున్న కారును అటవీ సిబ్బంది అడ్డుకున్నారు. ఆ దంపతుల వద్ద చేపట్టిన విచారణలో వాస్తవం తెలియడంతో, వారికి సరైన మార్గం చూపి పంపించారు. కాగా, ఇటీవల ఊటీకి వెళుతున్న పలువురు పర్యాటకులు గూగుల్ మ్యాప్ ద్వారా అడవుల్లోకి వెళ్లడం గమనార్హం.

నల్లజెండాలతో శ్రీలంక జాలర్ల నిరసన ప్రదర్శన

● చేపలవేట వద్దంటూ తమిళ జాలర్లకు హెచ్చరిక



పడవలపై నల్లజెండాలు కట్టి నిరసన ప్రదర్శన జరుపుతున్న శ్రీలంక జాలర్లు

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జాలర్లు నడి సముద్రంలో పడవలపై నల్లజెండాలు ఎగరవేస్తూ నిరసన ప్రదర్శన జరుపుతుండటంతో చేపలవేటకు వెళ్లవద్దంటూ రామనాథపురం జిల్లా రామేశ్వరం సహా ఇతర ప్రాంతాలకు చెందిన తమిళ జాలర్లకు అధికారులు హెచ్చరిక జారీ చేశారు. ఇటీవ రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు జరిపి నిర్బంధించడం ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలో రామేశ్వరం తదితర ప్రాంతాలకు చెందిన తమిళ జాలర్లకు వ్యతిరేకంగా శ్రీలంక జాలర్లు నడి సముద్రంలో పడవలపై నల్లజెండాలు ఎగురవేస్తూ ఆందోళన చేపట్టారు. రామేశ్వరం సహా పలు ప్రాంతాల నుంచి చేపలవేటకు వచ్చే జాలర్లు తమ దేశపు సముద్ర జలాల సరిహద్దుల్లో అక్రమంగా చొరబడి చేపల సంపదను కొల్లగొట్టి తమ జీవనోపాధికి అడ్డుకట్టగా తయారవుతున్నారంటూ ఆరోపిస్తూ నిరసన ప్రదర్శనలు ప్రారంభించారు. దీంతో రామేశ్వరం సహా ఇతర ప్రాంతాలకు చెందిన జాలర్లు ఎవరూ తదుపరి ఉత్తర్వు జారీ అయ్యేంతవరకూ సముద్రంలో చేపలవేటకు వెళ్లకూడదంటూ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. దీంతో మూడు రోజులకు ముందు సముద్రంలో చేపలవేటకు వెళ్లిన జాలర్లంతా తిరుగుముఖం పడుతున్నారు.

రాష్ట్రప్రజలను మభ్యపరిచేలా కొత్త కథలతో మోదీ రాక

● మంత్రి శివశంకర్

ప్యారీస్, మార్చి 3: రాష్ట్రప్రజలను మభ్యపెట్టేలా ప్రధాని మోదీ రాష్ట్రానికి తరచూ వస్తూ కొత్త కథలు చెబుతున్నారని రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ ధ్వజమెత్తారు. అరియలూరు అన్నా విగ్రహం సమీపంలో ఆదివారం జరిగిన డీఎంకే బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ... ఉచిత పథకాలకు మేం వ్యతిరేకం అని చెబుతున్న మోదీ, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ తరహా పథకాలు ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి 10 రోజులకు ఒకసారి వస్తున్న మోదీ సరికొత్త అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. దేశంలోని ప్రజా రంగ సంస్థలను కార్పొరేట్లకు విక్రయించే ఏజెంటుగా మోదీ వ్యవహరిస్తున్నారని మంత్రి విమర్శించారు.

అన్నానగర్‌లో 11 మసాజ్ సెంటర్ల సీజ్

పెరంబూర్, మార్చి 3: అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న 11 మసాజ్ సెంటర్లకు పోలీసులు సీజ్ చేశారు. స్థానిక అన్నానగర్, చుట్టుపక్కల ప్రాంతాల్లో తగిన అనుమతులు లేకుండా స్పా, మసాజ్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు, కొన్నింటిలో వ్యభిచారం జరుగుతోందని పోలీసులకు ఫిర్యాదులందాయి. ఈ ఫిర్యాదుల ఆధారంగా ప్రత్యేక బృందం పోలీసులు శుక్రవారం ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఆ ప్రాంతంలో 11 స్పా, మసాజ్ సెంటర్లు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించి వాటి సీజ్ చేసి యజమానులను విచారిస్తున్నారు.

నకిలీ నగలు కుదువ: రూ.7.5 కోట్ల మోసం

పెరంబూర్, మార్చి 3: శివకాశిలోని ఓ ప్రభుత్వ బ్యాంకులో 15 కిలోల నకిలీ నగలు తాకట్టుపెట్టి రూ.7.5 కోట్ల మోసానికి పాల్పడిన బ్యాంక్ అప్రైజర్ సహా ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. విరుదునగర్ జిల్లా శివకాశిలోని ఓ ప్రభుత్వ బ్యాంక్‌ను కొద్దినెలల క్రితం మండల మేనేజర్ రంజిత్ పరిశీలించారు. తాకట్టుపెట్టిన నగలను పరిశీలించిన ఆయన వాటిలో 15.427 కిలోలను నకిలీ నగలుగా గుర్తించారు. 56 మంది నకిలీ నగలు తాకట్టుపెట్టి రూ.7,55,56,509 రుణాలు పొందినట్లు గుర్తించారు. ఈ మోసంపై అధికారులు అందజేసిన ఫిర్యాదుతో బ్యాంక్ అప్రైజర్ ముత్తుమణి, అతనికి సహకరించిన బాలసుందరంను అరెస్ట్ చేసిన పోలీసులు, ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయమైనా ఉందా అంటూ విచారిస్తున్నారు.

అన్నాడీఎంకేలో నటి గాయత్రి రఘురాంకు పదవి

పెరంబూర్, మార్చి 3: అన్నాడీఎంకే మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా నటి గాయత్రి రఘురాంను నియమిస్తూ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటన విడుదల చేశారు. ఇటీవల బీజేపీ నుంచి వైదొలిగిన ఆమె అన్నాడీఎంకేలో చేరారు. ఆమెకు పార్టీ నేతలు, కార్యకర్తలు సహకరించాలని ఈపీఎస్ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఓటు ప్రాధాన్యం తెలుపుతూ మారథాన్



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఏసీ షణ్ముగం

వేలూరు, మార్చి 3: మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు, 100 శాతం ఓట్లు నమోదు చేయాలని అనే అంశాలతో మారథాన్ పోటీలు ఆదివారం నగరంలో జరిగాయి. పుదియ నీతి కట్చి వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసీ షణ్ముగం జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. పాత బస్టాండ్ నుంచి ప్రారంభమైన మారథాన్ తొరప్పాడి వరకు 4 కి.మీ సాగింది. ఈ పోటీల్లో పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 1,000 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల విజేతలకు ఏసీ షణ్ముగం నగదు బహుమతులు అందజేశారు.

ప్రధానిగా ఎన్నిసార్లైనా రాష్ట్రానికి రావొచ్చు

● కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం

ఐసిఎఫ్, మార్చి 3: మోదీ దేశ ప్రధాని అని, ఆయన ఎన్ని సార్లైనా రాష్ట్రానికి వచ్చే హక్కు ఉందని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం అభిప్రాయపడ్డారు. పుదుకోటలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో డీఎంకే - కాంగ్రెస్ మధ్య ఎలాంటి విబేధాలు లేవన్నారు. రాబోయే ఎన్నికల్లో డీఎంకే కూటమి 39 స్థానాలు చేజిక్కించుకుంటుందని తెలిపారు. హిందుత్వ రాజకీయాలను రాష్ట్ర ప్రజలు అంగీకరించే ప్రసక్తే లేదని ఎంపీ తెలిపారు.



ఎగ్మూరు రైల్వేస్టేషన్‌లో మైలాడుదురైకి బయలుదేరుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్‌కు వీడ్కోలు పలుకుతున్న డీఎంకే శ్రేణులు

మైలాడుదురై కలెక్టర్‌కు కొత్త కార్యాలయం

● నేడు ప్రారంభించనున్న స్టాలిన్

పెరంబూర్, మార్చి 3: మైలాడుదురైలో కొత్తగా నిర్మించిన కలెక్టరేట్‌ను ప్రారంభించేందుకు ఆదివారం సీఎం స్టాలిన్ చెన్నై నుంచి రైలులో బయల్దేరి వెళ్లారు. మున్నంపందల్‌లో రూ.114.48 కోట్లతో నిర్మించిన ఈ కార్యాలయాన్ని సోమవారం సీఎం ప్రారంభించనున్నారు. ఈక్రమంలో సీఎం ఆదివారం సాయంత్రం 4.15 గంటలకు ఎగ్మూర్ నుంచి సెందూర్ ఎక్స్‌ప్రెస్ ద్వారా రాత్రి 8.15 గంటలకు శీర్గాళి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మా ర్గంగా తిరువేంగాడులోని తమ మామగారింటికి వె ళ్లారు. రాత్రికి అక్కడే బస చేసిన ముఖ్యమంత్రి సోమవారం రోడ్డు మార్గంగా మైలాడు దురై చేరుకొని ఉద యం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు తిరుచ్చి - చెన్నై చోళన్ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి సాయంత్రం 6.15 గంటలకు చెన్నైకి చేరుకుంటారు.

గజవాహనంలో విహరించిన పద్మావతి అమ్మవారు



చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని పద్మావతి అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారిని గజవాహనంలో నగర వీధుల్లో ఊరేగించారు. రెండు రోజులుగా ఈ ఉత్సవాలను గురించి టీటీడీ నిర్వాహకులు చేసిన ప్రచార కార్యక్రమాలతో ఆదివారం ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు నగరం నలమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా ఆలయ మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అటుపిమ్మట పట్టుపీతాంబరాలు, సర్వాభరణాల, వివిధ పుష్పాలంకరణలతో పద్మావతి అమ్మవారిని అలంకరించి గజవాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ జీఎన్ చెట్టి రోడ్డు పద్మావతి అమ్మవారి ఆలయం నుంచి ఈ గజవాహన సేవ ప్రధాన రహదారుల మీదుగా కొనసాగింది. దారి పొడవునా భక్తులు అమ్మవారికి కర్పూరనీరాజనాలు సమర్పించారు. ఇలా కర్పూరహారతినిచ్చిన భక్తులు ఆలయం తరపున చిన్న లడ్డూను ప్రసాదంగా అందజేశారు. ఈ వేడుకల్లో టీటీడీ స్థానిక సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, ఉపాధ్యక్షులు ఆనంద్‌కుమార్‌రెడ్డి, సుదందిరం, శరణ్‌రెడ్డి, సభ్యులు కృష్ణారావు, మోహన్‌రావు, శంకర్, కార్తికేయన్, శ్రీనివాసులు రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రంగారెడ్డి, అశోక్, అజయ్, సుధాకర్‌రెడ్డి, ఇంద్రా రాజేంద్రన్, మాలా శంకర్, రాధాకృష్ణ, రాధా కృష్ణమూర్తి, డాక్టర్ గాయత్రి, మాజీ సభ్యులు రవిబాబు, చలపతి పాల్గొన్నారు. డిప్యూటీ ఈవో విజయకుమార్, ఆలయ సూపరింటెండెంట్ పుష్పలతా ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాల వితరణ జరిగింది.

చిత్రజ్యోతి

24 గంటలపాటు నాన్‌స్టాప్ సంగీత విభావరి

● ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికేట్‌తో నిర్వాహకులు

దుబాయ్‌లో నివసించే కళాకారులతో కలిసి కోలీవుడ్‌కు చెందిన సినీ కళాకారులు 24 గంటల పాటు నాన్‌స్టాప్ సంగీత విభావరిని నిర్వహించారు. దీనికి 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కింది. ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహ్మాన్ సోదరి, సంగీత దర్శకురాలు, నేపథ్య గాయని ఏఆర్ రెహానా, నటి కోమల్ శర్మ పర్యవేక్షణలో ప్రపంచ రికార్డు సంగీత విభావరి జరిగింది. తమిళం, తమిళ సంస్కృతి, మన తమిళ నేల నుంచి జీవనభృతి కోసం విదేశీ ఉద్యోగాల కోసం వలస వెళ్లిన వారికి ప్రధాన జీవనాధారంగా తమిళ సంగీతం మారింది. అందుకే ప్రపంచ వేదికలపై తమిళ పాటలకు విపరీతమైన ఆదరణ లభిస్తోంది. సాధారణంగా తమిళ సంస్కృతి, తమిళ సంగీతానికి ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ప్రాచుర్యం కల్పించడడానికి తమిళ కళాకారులు అమితాసక్తిని చూపుతుంటారు. ఈ కోవలోనే ఈ నాన్ స్టాప్ సంగీత విభావరిని నిర్వహించారు. ఇందుకోసం దుబాయ్‌లో నివసిస్తున్న తమిళ కళకారులంతా ఏకమయ్యారు. ఇందులో ఏకధాటిగా 24 గంటల పాటు అన్ని రకాల పాటలు పాడి సరికొత్త రికార్డును నెలకొల్పారు. దీనిపై ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ మోటరేటర్ వివేక్ మాట్లాడుతూ... గతంలో 13.5 గంటల పాటు నిరంతయారంగా పాటలు పాడటం ఇప్పటివరకు రికార్డుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భగవతి రవి, త్యాగు, బాలాజీ, రాకేష్, అజ్, విఘ్నేశ్వరన్, జగనాథన్, పద్మిని, వల్లి రవి, మృదులా బాలకృష్ణన్, శరణ్య, జనని వంటి అనేక మంది సినీ నేపథ్యగాయకులు నేపథ్య గానం చేశారు.

'ఎనక్కొరు వైఫ్ వేణుండా' స్ట్రీమింగ్



'ఎనక్కొరు వైఫ్ వేణుండా'లో ఓ దృశ్యం

ప్రముఖ జర్నలిస్ట్ జియా తెరకెక్కించిన 'ఎనక్కొరు వైఫ్ వేణుండా' షార్ట్‌ఫిల్మ్ శనివారం రాత్రి నుంచి ఫిల్మ్ డ్యూడ్ అనే ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. సెబాస్టియన్ ఆంథోనీ, అక్షయ, అనకా, వినీత, మోనిక ప్రధాన పాత్రలను పోషించిన ఈ షార్ట్ ఫిల్మ్ విలేజ్ పతాకంపై అమోహన్ నిర్మించారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలను సమకూర్చిన జియా.. దర్శకత్వం కూడా వహించారు. గత యేడాది జూన్‌లో 'గల్వా' అనే రొమాంటిక్ థ్రిల్లర్ షార్ట్ ఫిల్మ్‌కు దర్శకత్వం వహించగా, ఇది ఆయనకు రెండో షార్ట్ ఫిల్మ్ కావడం గమనార్హం. అభిషేక్ సినిమాటోగ్రఫీ అందించారు. ఈ షార్ట్‌ఫిల్మ్ ఫస్ట్‌లుక్ రిలీజైనప్పటి నుంచి అభిమానుల్లో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఈ షార్ట్‌ఫిల్మ్‌ను శనివారం రిలీజ్ చేశారు.

సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'ది డార్క్ హెవెన్'



నకుల్ హీరోగా తెరకెక్కిన కొత్త చిత్రం 'ది డార్క్ హెవెన్'. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను హీరోలు శశికుమార్, శిబి సత్యరాజ్ రిలీజ్ చేశారు. బాలాజీ దర్శకత్వం వహించిన ఈ సిమాను టీమ్ బి ప్రొడక్షన్ హౌస్ బ్యానరుపై నిర్మించారు. ఈ సినిమా గురించి దర్శకుడు బాలాజీ మాట్లాడుతూ... 'ఒక గ్రామంలో ప్రతి 25 యేళ్లకోసారి అనుమానాస్పద రీతిలో హత్య జరుగుతుంది. ఈ హత్యల్లోని మిస్టరీని గుర్తించలేకపోతారు. ఎవరైన గ్రామస్తుడు ఈ హత్యల ప్రస్తావన తెస్తే ఇతరులు మాత్రం ఒక కథగా పేర్కొని కొట్టిపారేస్తుంటారు. అలాంటి గ్రామానికి ఇలపారి అనే ఇన్‌స్పెక్టర్ వెళతారు. ఈయన ఆ హత్యల వెనుక ఉన్న మిస్టరీని ఛేదిస్తారు. ఈ విచారణలో అనేక రహస్యాలు, చిక్కుముడులకు పరిష్కారం చూపిస్తాడు. కేరళకు చెందిన రేణు సౌందర్ హీరోయిన్. శ్రీలంక నటుడు ఒకరు ఎవరూ ఊహించని అతిథి పాత్రలో కనిపిస్తారు. శక్తి బాలాజీ సంగీతం సమకూర్చగా, తమిళం, తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశాం' అని పేర్కొన్నారు.

ఐశ్వర్య రాజేష్ - దేవ్ జంటగా 'వలయం'



పూజా కార్యక్రమంలో ఐశ్వర్య, దేవ్, విజయ్ సేతుపతి తదితరులు

యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత జి.ఢిల్లీ బాబు సమర్పణలో డెబ్యూ డైరెక్టర్ మనోభారతి తెరకెక్కిస్తున్న చిత్రం 'వలయం'. ఐశ్వర్య రాజేష్, దేవ్ జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ శనివారం పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. ఇందులో ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి పాల్గొని యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. తమిళ చిత్రపరిశ్రమలో వైవిధ్యభరితమైన కథలతో సినిమాలు యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ అనేక హిట్ చిత్రాలను నిర్మించింది. అలాగే, ప్రతిభ కలిగిన కొత్తవారికి అవకాశం ఇస్తూ ప్రోత్సహించే నిర్మాత ఢిల్లీబాబు.. ఇపుడు నగరంలోని డీజీ వైష్ణవ్ కాలేజీ పూర్వవిద్యార్థి మనో భారతి సినిమాల్లో ఉన్న అతని ప్రతిభను చూసి.. ఈ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశాన్ని కల్పించారు. భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందించే ఈ ప్రాజెక్టుపై నిర్మాత ఢిల్లీ బాబు మాట్లాడుతూ... 'తమ బ్యానరు చక్కటి ఆలోచనలతో కూడిన సందేశాత్మక, సమాజానికి అవసరమైన వినోదాన్ని అందించే చిత్రాలను నిర్మిస్తుంది. గత పదేళ్లలో పలువురు కొత్త వారితో సినిమాలు తీయడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు చేపట్టిన కొత్త చిత్రం కూడా ప్రేక్షకులకు అత్యుత్తమ అనుభూతిని కలిగించేలా రూపొందించనున్నాం' అని పేర్కొన్నారు.

నెలాఖరుకు 'వందే మెట్రో' రైలు సిద్ధం

పెరంబూర్, మార్చి 3: 'వందే మెట్రో' రైలు తయారీ పనులు ఈ నెలాఖరు పూర్తవుతాయని రైల్వే వర్గాలు తెలిపాయి. స్థానిక ఐసీఎఫ్ కర్మాగారంలో గంటకు 100 కి.మీ వేగంతో వెళ్లేలా తొలి 'వందే మెట్రో' రైలు తయారీపనులు కొద్దినెలలుగా జరుగుతున్నాయి. ఈ విషయమై రైల్వే అధికారులు మాట్లాడుతూ... స్వల్పదూరం వెళ్లేలా వందే మెట్రో రైలు తయారు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 60 శాతం పనులు ముగిశాయని, ఈ నెలాఖరులోపు పనులు ముగించి రైల్వే బోర్డుకు అప్పగించనున్నామన్నారు. ప్రస్తుతం స్వల్ప దూరానికి నడుపుతున్న 'మెమో' రకం రైళ్ల స్థానంలో విడతలవారీగా వందే మెట్రో రైళ్లు నడపనున్నామని తెలిపారు. ఏసీ వసతి, ప్రయాణికులకు ఆహ్లాదం కలిగించేలా బోగీ లోపల అలంకారం, లగ్జరీ సీట్లు, సీసీ కెమెరాలు, అధునాతన టాయిలెట్, ఆటోమేటిక్ డోర్లు తదితర వసతులున్నాయని తెలిపారు. అవసరాన్ని బట్టి 8 నుంచి 12 పెట్టెలతో నడపవచ్చని, ఒక్కో పెట్టెలో 100 మంది కూర్చొనేలా, 200 మంది నిలబడి ప్రయాణించవచ్చని రైల్వే అధికారులు తెలిపారు.





సిద్ధమవుతున్న వందే మెట్రో రైలు

తిరుచెందూరులో మారథాన్





మారథాన్‌లో పరుగులు తీయటానికి సిద్ధంగా ఉన్న బాలికలు - మారథాన్‌లో గెలిచిన యువకుడికి నగదు బహుమతిని అందజేస్తున్న ఎంపీ కనిమొళి

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం తూత్తుకుడి జిల్లా తిరుచెందూరులో ఆ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ మారథాన్ అట్టహాసంగా కొనసాగింది. తూత్తుకుడి డీఎంకే ఎంపీ కనిమొళి ఈ మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఐదేళ్లలోపు బాలుర నుంచి నలభై యేళ్లు దాటినవారికంటూ వివిధ విభాగాలలో మారథాన్‌లు జరిపారు. విజేతలకు కనిమొళి బహుమతులు పంపిణీ చేశారు. రాష్ట్ర మంత్రి అనితా రాధాకృష్ణన్, పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కనిమొళి దగ్గరుండి మరీ అందరికీ వడ్డించారు.

రోగాల నిరోధానికి పరిశోధనలు అవసరం

● డాక్టర్ సింధూర గణపతి



శ్రీరామచంద్రావర్సిటీలో జరిగిన సభలో సింధూర గణపతిని సత్కరిస్తున్న ఉమాశంకర్

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు రోగాల నిరోధానికి విస్తృతమైన పరిశోధనలు సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర ప్రభుత్వ వైజ్ఞానిక ముఖ్య సలహాదారు డాక్టర్ సింధూర గణపతి పిలుపునిచ్చారు. పోరూరులోని శ్రీరామచంద్రా ఉన్నత విద్యా పరిశోధన సంస్థ (డీమ్డ్ వర్సిటీ) జాతీయ వైజ్ఞానిక వారోత్సవాల సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆ వర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థుల కోసం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు, పత్రాల సమర్పణ, క్విజ్ కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచినవారికి ఆయన బహుమతులు, సర్టిఫికేట్లు అందజేశారు. వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఉమాశంకర్, డీన్ డాక్టర్ కల్పనా బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న అడ్మిషన్లు

● రెండు రోజుల్లో 3.31 లక్షల మంది చేరిక

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గత రెండు రోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 1న విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి అడ్మిషన్లను ప్రారంభించారు. ఐదేళ్ల వయస్సు కలిగిన బాలబాలికలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు వారి తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత రెండు రోజుల్లో 3.31 లక్షల మంది విద్యార్థులు చేరినట్లు పాఠశాలల విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. సేలం, మదురై జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువమంది విద్యార్థులు చేరినట్లు పేర్కొన్నారు. సేలం జిల్లాలోని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 19,242 మంది అడ్మిషన్లు పొందినట్లు సమాచారం అందిందన్నారు. మదురై జిల్లాలో 18,127 మంది, దిండుగల్ జిల్లాలో 17,036, తిరువళ్లూరు జిల్లాలో 15,207, తిరువణ్ణామలైలో 13,579, తిరుప్పూరు జిల్లాలో 13204 మంది విద్యార్థులు చేరినట్లు వివరించారు. రాజధాని నగరం చెన్నైకి సంబంధించినంతవరకు 13,135 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మాధవరంలో 1,568 మంది, చింతాద్రిపేటలో 1,058, ఆలందూరు 1,220, రాయపురంలో 1298 మంది విద్యార్థులు చేరారు.

కొడైక్కెనాల్‌లో పక్షుల గణన ప్రారంభం

ప్యారీస్, మార్చి 3: దిండుగల్ జిల్లా కొడైక్కెనాల్‌లోని పక్షుల శరణాలయంలో పక్షుల గణన శనివారం ప్రారంభమైంది. జిల్లా అటవీ శాఖ అధికారి యోగేష్ కుమార్ పర్యవేక్షణలో, రేంజర్ శివకుమార్ నేతృత్వంలో ముంబై, కోల్‌కత్తా, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన 33 మంది పక్షుల ప్రేమికులు పాల్గొన్నారు. ఈ గణన మరో రెండు రోజులు జరుగుతుందని అధికారులు తెలిపారు.



పక్షుల గణనలో అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మెట్రో రైళ్లు, సిటీ బస్సుల్లో పెరిగిన రద్దీ



చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కోడంబాక్కం - తాంబరం మార్గంలో ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు రైళను రద్దు చేయడంతో నగరమంతటా మెట్రోరైళ్లు, సిటీ బస్సులలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. తాంబరం మార్గంలో ప్రతి ఆదివారం పట్టాల మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు ఆ మార్గంలో రైళ్లను నిలిపివేసి రైల్వే ఇంజనీరింగ్ నిపుణులు మరమ్మతులు చేపడుతున్నారు. ఈ క్రమంలో మూడో ఆదివారం 44 ఎలక్ట్రిక్ రైళ్ల సర్వీసులను మధ్యాహ్నం 3.15 వరకు నిలిపివేశారు. అదే సమయంలో ఆ మార్గంలోని రైలు పట్టాలను, హైఓల్టేజీ విద్యుత్ కేబుళ్లను మరమ్మతులు చేపట్టారు. ఈ కారణంగా తాంబరం వైపు వెళ్లేవారంతా సిటీ బస్సులు, మెట్రోరైళ్లను ఆశ్రయించాల్సి వచ్చింది. తాంబరం వైపు మహానగర రవాణా సంస్థ అదనంగా 150 బస్సులను నడిపింది. ఆ బస్సులన్నీ ప్రయాణికులతో కిటకిటలాడాయి. తాంబరం, గిండి, టి.నగర్, సెంట్రల్, బీచ్ మార్గాల్లో ఈ బస్సులను నడిపినట్లు మహానగర రవాణా సంస్థ అధికారులు తెలిపారు. బ్రాడ్వే నుంచి అన్నాసాలై మీదుగా తాంబరానికి 60 బస్సులు అదనంగా నడిపినట్లు పేర్కొన్నారు. ప్రతి పావుగంటకు ఒక బస్సు చొప్పున తాంబరం మార్గంలో బస్సులు నడిపినా ప్రయాణికుల రద్దీ ఏ మాత్రం తగ్గలేదని చెప్పారు. ఇక మెట్రోరైళ్లు కూడా వేకువజాము నుంచే ప్రతి పది నిమిషాలకు ఒకటి చొప్పున నడిచాయి. ఆ రైళ్లలోనూ తాంబరం వైపు వెళ్లే ప్రయాణికులే అధికంగా ప్రయాణించారు.

ద్రావిడేతర పార్టీదే అధికారం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

పెరంబూర్, మార్చి 3: రాష్ట్రంలో 2026 జరగనున్న శాసనసభ ఎన్నికల్లో ద్రావిడేతర పార్టీ అధికారం చేపడుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై జోస్యం చెప్పారు. తిరుచ్చి సమీపం సిరుగనూరులో ఇండియా జననాయగ కట్చి (ఐజేకే) ఆధ్వర్యంలో 'దేశాన్ని రక్షిద్దాం... తమిళ భాషను పెంచుదాం' అనే పేరుతో మహానాడు శనివారం రాత్రి జరిగింది. ఈ మహానాడుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న అన్నామలై మాట్లాడుతూ... రాష్ట్ర సంప్రదాయ, సాహస క్రీడ జల్లికట్టుకు అనుమతి, పదేళ్లుగా ప్రపంచంలోని ఏ దేశానికి వెళ్లినా తమిళ భాషకు ప్రాధాన్యం చేకూర్చేలా వ్యవహరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రాభివృద్ధికి పలు పథకాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రం తరపున ఎన్నికైన ఎంపీల్లో ఒక్క పారివేందర్ మాత్రమే ప్రజా ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని అభినందించారు. తాము అమలుచేసిన పథకాలు తెలిపి ఓట్లు అడగలేని స్థితిలో అధికార డీఎంకే ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలో కూటమి మెజార్టీ విజయాలు సాధిస్తుందని, అనంతరం జరిగే శాసనసభ ఎన్నికల్లో ద్రావిడ అనే పేరు లేని పార్టీ అధికారం చేపడుతుందని అన్నామలై తెలిపారు.

మోదీ పర్యటనలతో ఎలాంటి ఫలితాలుండవు!

● మాజీ మంత్రి జయకుమార్

పెరంబూర్, మార్చి 3: రాష్ట్రంలో తరచూ ప్రధాని నరంద్ర మోదీ పర్యటనతో ఎలాంటి ఫలితాలుండవని అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ తెలిపారు. నగరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అన్నాడీఎంకే దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత చిత్రపటాలు, వారి పేర్లను వినియోగించుకొని ఓట్లు పొందాలని బీజేపీ భావిస్తోందన్నారు. వారి నేతలపై వారికే నమ్మకం లేదన్నారు. బీజేపీని ఒక పార్టీగా తాము భావించడం లేదని అన్నారు. వేలాదిమంది కరుణానిధిలు, స్టాలిన్‌లు, బీజేపీ నేతలు వచ్చినా అన్నాడీఎంకేను ఏమీ చేయలేరన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో బలమైన కూటమి ఏర్పాటు కానుందని, మరో పది రోజుల్లో కూటమిపై స్పష్టత వస్తుందని జయకుమార్ తెలిపారు.

'నాకు అప్పగించే పని సక్రమంగా నిర్వహిస్తా'

● గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్

ఐసిఎఫ్, మార్చి 3: తనకు అప్పగించే పని సక్రమంగా నిర్వహిస్తానని పుదుచ్చేరి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ తెలిపారు. కన్నియకుమారి జిల్లాలో 'మహిళల శబరిమల'గా ప్రసిద్ధి చెందిన మండైక్కాడు భగవతి అమ్మన్ ఆలయంలో 10 రోజులు జరిగే మాసి బ్రహ్మోత్సవాల ధ్వజారోహణం ఆదివారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో తమిళిసై పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీలపై పలువురు విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ... ఎన్నికల్లో తాను పోటీ చేసే అంశం దేవుడే నిర్ణయిస్తారన్నారు. ప్రస్తుతం తనకు లభించిన పదవికి సరైన న్యాయం చేస్తున్నానని అన్నారు. తాను ఒక సాధారణ కార్యకర్తను అని, అప్పగించిన పని సక్రమంగా చేయడమే తన లక్ష్యమని గవర్నర్ తెలిపారు.

నేడు అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నాలు

ప్యారీస్, మార్చి 3: డీఎంకే ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో మాదకద్రవ్యాల విక్రయాలను అడ్డుకోవడంలో డీఎంకే ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, వీటిలో అధికార పార్టీల నేతల ప్రమేయం ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మాదకద్రవ్యాల విక్రయాలు, తరలింపును అడ్డుకోవడంలో విఫలమైన డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ సోమవారం కలెక్టరేట్ల ఎదుట సోమవారం ఉదయం ధర్నాలు చేపట్టనున్నట్లు ఈపీఎస్ తెలిపారు.

ఘనంగా అడిగళార్ అవతార మహోత్సవాలు

● రూ.3.25 కోట్ల సహాయాల పంపిణీ



పేద విద్యార్థులకు విద్యా పరికరాలను పంపిణీ చేస్తున్న మంత్రి దామో అన్బరసన్, ఎంపీ జగద్రక్షగన్ తదితరులు

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి సిద్ధర్‌పీఠం ఆధ్యాత్మిక గురువు బంగారు అడిగళార్ 84వ జయంతి వేడుకలు ఆదివారం ఆ పీఠంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మంత్రి దామో అన్బరసన్ పాల్గొని నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారికి రూ.3.25 కోట్ల విలువైన సహాయాలను పంపిణీ చేశారు. ఈ వేడుకలకు ఆధ్యాత్మిక ఉద్యమ సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీ బంగారు అడిగళార్ అధ్యక్షత వహించారు. ఎంపీ జగద్రక్షగన్, కాంచీపురం ఎంపీ సెల్వం, సెయ్యారు శాసనసభ్యుడు పనయూరు బాబు, పుదుచ్చేరి డిప్యూటీ స్పీకర్ రాజవేలు, మదురై జిల్లా మేజిస్ట్రేష్ రమేష్‌బాబు, కర్ణాటక సంగీత గాత్ర విద్వాంసుడు శీర్గాళి శివచిదంబరం తదితరులు పాల్గొన్నారు. సేలం, నామక్కల్ ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక విభాగం నిర్వాహకులు ఈ ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టారు.